
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
కృష్ణా జిల్లా వార్తలు
శుక్రవారం 17 జనవరి 2025



తిరుగు ప్రయాణం.. తంటాలు : పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో బస్సులో సీటు కోసం పాట్లు





పీఎన్‌బీఎస్‌లో..



రైల్వేస్టేషన్‌లో రద్దీ



కటకటా.. కిటకిట..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : తిరుగు ప్రయాణాలతో పండిట్ నెహ్రూ బస్టాండ్, రైల్వేస్టేషన్ గురువారం కిటకిటలాడాయి. బస్సులు, రైళ్ల కోసం పెద్దసంఖ్యలో ప్రయాణికులు ఎగబడ్డారు. పీఎన్‌బీఎస్ నుంచి హైదరాబాద్ సెక్టార్‌లోనే సాయంత్రం వరకు 80 ప్రత్యేక బస్సులను నడిపారు. రాత్రికి అదనంగా నడపాల్సి వచ్చింది. రిజర్వేషన్ లేకుండా అప్పటికప్పుడు మరో 25 బస్సులను దూరప్రాంతాలకు నడిపారు. బెంగళూరుకు 4, చెన్నైకు 3 స్పెషల్స్ నడిచాయి. రైల్వేస్టేషన్‌లో కూడా రద్దీ పెరిగింది. స్పెషల్ రైళ్లలో ప్రయాణికులు కిక్కిరిసి ప్రయాణించారు.

సరికొత్తగా..

కొండపావులూరులో ఎన్డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎం భవనాలు

- 19న అమిత్‌షా చేతులమీదుగా ప్రారంభం
- ప్రకృతి విపత్తుల నిర్వహణకు ఎంతో కీలకం
- గతంలో టీడీపీ హయాంలోనే శంకుస్థాపన
- వైసీపీ హయాంలో అడ్డుకునేందుకు కుట్ర
- రోడ్డు బాగు చేయకుండా ఐదేళ్లపాటు ఇబ్బందులు
- కూటమి ప్రభుత్వం రాకతో పూర్తయిన పనులు

సీఎం చంద్రబాబు ఆకాంక్ష.. వెంకయ్యనాయుడి సహకారంతో పూర్తి







కొండపావులూరులో అందంగా సిద్ధమైన ఎన్డీఆర్ఎఫ్ బ్లాక్ (ఇన్‌సెట్‌లో) ఎన్డీఆర్ఎఫ్ క్వార్టర్లు, ఎన్ఐడీఎం క్యాంపస్

ఆశల ఉషోదయం వైపు అడుగులు పడుతున్నాయి. ఎన్నేళ్ల నుంచి కన్న కలలో ఒక్కొక్కటిగా వాస్తవంలోకి వస్తున్నాయి. కొండపావులూరులో ఏర్పాటుచేసిన కేంద్ర సంస్థలు ఎన్డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎం భవనాలు ఈనెల 19న ప్రారంభంకానున్నాయి. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షల మేరకు, అప్పటి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వెంకయ్యనాయుడు సహకారంతో మంజూరైన ఈ భవనాలు వైసీపీ హయాంలో చతికిలపడ్డాయి. తిరిగి టీడీపీ కూటమి ప్రభుత్వం రాకతో పనులు పూర్తిచేసుకుని 19న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేతులమీదుగా ప్రారంభానికి సిద్ధమయ్యాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కొండపావులూరు సమీపంలోని సూరంపల్లిలో ప్లాస్టిక్ ఇంజనీరింగ్ కోర్సులను అందించే 'సీపెట్' సంస్థ ఇప్పటికే కొలువుతీరింది. కాగా, రాష్ట్ర భౌగోళిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రకృతి విపత్తులను ఎదుర్కొనే నేషనల్ డిజాస్టర్స్ రెస్క్యూ ఫోర్స్ (ఎన్డీఆర్ఎఫ్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐడీఎం) వంటి సంస్థలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రకృతి విపత్తులను ఎదుర్కొనే ఫోర్స్‌ను ఎన్డీఆర్ఎఫ్ అందిస్తుండగా, వాటిని అధ్యయనం చేయటంతో పాటు ధీటుగా ఎదుర్కొనే విధానాలపై శిక్షణ కల్పించటం వంటివి ఎన్ఐడీఎం చేస్తుంది. ఈ రెండు ప్రతిష్ఠాత్మక సంస్థలు కొండపావులూరులో ఏర్పాటయ్యాయి.

గతంలో టీడీపీ హయాంలో..

దాదాపు 1,000 కిలోమీటర్ల సువిశాల సముద్రతీరం కలిగిన మన రాష్ట్రానికి విపత్తులను ఎదుర్కొనే సంస్థల అవసరం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ రెండు సంస్థలకు బీజం పడింది. వాస్తవానికి ఎన్డీఆర్ఎఫ్ పదో బెటాలియన్‌ను 2012లోనే కేంద్రం మంజూరు చేసింది. అప్పట్లో తగిన స్థలం చూపించకపోవటం వల్ల క్యాంపస్ ఏర్పాటు చేయలేదు. దీంతో నాగార్జున యూనివర్సిటీలో తాత్కాలికంగా దీనిని నిర్వహించారు. రాష్ట్ర విభజన తర్వాత ఏర్పడిన టీడీపీ ప్రభుత్వ హయాంలో భూములు ఇవ్వటానికి ముందుకొచ్చారు. కొండపావులూరును ఎంపిక చేసి 50 ఎకరాలు కేటాయించారు. 2017లో అప్పటి కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేతుల మీదుగా ఎన్డీఆర్ఎఫ్ భవన సముదాయానికి శంకుస్థాపన జరిగింది. అలాగే, ఎన్ఐడీఎంకు అప్పటి టీడీపీ ప్రభుత్వం 10 ఎకరాలను కేటాయించింది. ఎన్డీఆర్ఎఫ్‌కు శంకుస్థాపన చేసిన సరిగ్గా ఏడాదికి అంటే.. 2018లో ఎన్ఐడీఎం భవనానికి వెంకయ్యనాయుడు శంకుస్థాపన చేశారు. విపత్తు నిర్వహణలకు సంబంధించిన శిక్షణే ఇక్కడ ప్రధానమైనప్పటికీ పరిశోధనలు కూడా జరుగుతుంటాయి. దేశ రాజధాని ఢిల్లీ తర్వాత రెండోస్థానంలో కొండపావులూరులోని ఎన్ఐడీఎం కావడం విశేషం. ఈ భవన సముదాయాలు పూర్తయ్యాక ఎన్డీఆర్ఎఫ్ పదో బెటాలియన్ చాలాకాలంగా కార్యకలాపాలు నిర్వహిస్తూ వస్తోంది. కొండపావులూరులో 11 బృందాలు పనిచేస్తున్నాయి. కర్ణాటకలో మరో 4 బృందాలు పనిచేస్తున్నాయి. పొరుగున ఉన్న హైదరాబాద్‌లో 1 బెటాలియన్, విశాఖలో మరో 2 బెటాలియన్లు పనిచేస్తున్నాయి.

వైసీపీ హయాంలో..

ఎన్డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎంలు ఏర్పాటవుతున్న ప్రాంతంలో సరైన రహదారులు కూడా లేకపోవటంతో భూములు సేకరించారు. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్మాణానికి ఎలాంటి సహకారం అందించలేదు. ఎన్డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎంలు పదేపదే వైసీపీ ప్రభుత్వానికి లేఖలు రాసినా పట్టించుకోలేదు. సరైన దారి లేకపోతే పనులు జరగవని వైసీపీ భావించింది. అయితే, దారులు బాగోకపోయినా ఎన్డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎం భవనాల పనులు జరిగాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ రహదారులను అభివృద్ధి చేసింది. దీంతో ప్రతిష్ఠాత్మక సంస్థలు అందుబాటులోకి వచ్చాయి. ఈ రెండు కేంద్ర సంస్థలను ప్రారంభించడానికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఈనెల 18న నగరానికి చేరుకుంటారు. విజయవాడ విమానాశ్రయం నుంచి ఆయన నేరుగా సీఎం చంద్రబాబు నివాసంలో విందుకు హాజరవుతారు. ఆ తర్వాత నగరంలోని నోవాటెల్ హోటల్‌లో బస చేస్తారు. 19వ తేదీ ఉదయాన్నే కొండపావులూరు బయల్దేరతారు. హోంమంత్రి అమిత్‌షాతో పాటు సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు కింజరపు రామ్మోహన్‌నాయుడు, బండి సంజయ్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర హోంమంత్రి అనిత కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రారంభోత్సవం అనంతరం బహిరంగ సభలో అమిత్‌షా ప్రసంగిస్తారు.

తప్పు కోడానికా?

ఆర్‌డబ్ల్యూఎస్‌లో మరో అవినీతి మరక

- మచిలీపట్నం సబ్ డివిజన్ పనుల్లో అవకతవకలు
- చేయని పనులకు ఎంబుక్‌లో రికార్డు, చెక్‌మెజర్‌మెంట్
- క్వాలిటీ కంట్రోల్ విభాగ తనిఖీల్లో బయటపడిన బండారం
- క్వాలిటీ కంట్రోల్ నివేదిక సరికాదని తాజాగా అభియోగం
- కలెక్టర్‌కు నోట్‌ఫైల్.. రికార్డుల్లో సవరణకు ఆమోదం

తిమ్మిని బమ్మిని చేసి.. తప్పును ఒప్పుగా మార్చేసి.. చేసిన దొంగపని నుంచి బయటపడటానికి గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) ఇన్‌చార్జి ఈఈ ప్రయత్నం చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. మచిలీపట్నం సబ్ డివిజన్ పరిధిలో జరిగిన ఫిల్టర్ మీడియా పనుల్లో జరిగిన అవకతవకలను సరిచేయడానికి అప్పటి డీఈ.. ఇప్పటి ఇన్‌చార్జి ఈఈ తెగ ప్రయత్నం చేస్తున్నారు. తప్పులను క్వాలిటీ కంట్రోల్ విభాగం రెండుసార్లు నిర్ధారించినా.. కలెక్టర్‌ను ఏమార్చి, సవరణకు ఆదేశాలు పొంది, తప్పును కప్పిపుచ్చుకునేందుకు తంటాలు పడుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సామూహిక రక్షిత మంచినీటి పథకం (సీపీడబ్ల్యూఎస్)లో భాగంగా మచిలీపట్నం సబ్ డివిజన్ పరిధిలోని చోరంపూడి గ్రామంలో 0.5 ఎంఎల్‌డీ మైక్రోఫిల్టర్‌లో కొత్త ఫిల్టర్ మీడియా మార్పించటానికి జిల్లా పరిషత్ నిధులు రూ.5 లక్షలు మంజూరయ్యాయి. ఈ పనిని అప్పట్లో వైసీపీ అనుకూల కాంట్రాక్టర్‌తో చేయించారు. ఈ పని పూర్తికాకుండానే గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్)లో బిల్లులు పెట్టినట్టు అప్పట్లోనే ఆరోపణలొచ్చాయి. మైక్రోఫిల్టర్‌లో నింపాల్సిన ఫిల్టర్ మీడియా పరిమాణంలో చాలా వ్యత్యాసం ఉన్నట్టు వెలుగుచూసింది. 600 కేజీల కార్బన్ వేయాల్సి ఉండగా, 1,200 కేజీలు వేసినట్టు బిల్లులు పెట్టారు. ఎంబుక్‌లోనూ ఇదే నమోదు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)లు సంతకం కూడా చేసి జడ్పీకి బిల్లులు పంపారు. ఆ తర్వాత ఈఈకి అనుమానం వచ్చి ఆ పనిని తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని ఆదేశించారు. పూర్తిగా పనులు చేయకుండానే ఎంబుక్‌తో పాటు ఇతర రికార్డుల్లో నమోదు చేశారని గుర్తించారు. దాదాపు రూ.2.3 లక్షల మేర చేయని పనులకు బిల్లులు పెట్టినట్టు నిర్ధారించారు. కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన బిల్లులో 50 శాతం మేర రికవరీ చేయాల్సిందిగా ప్రతిపాదిస్తూ ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులకు క్వాలిటీ కంట్రోల్ విభాగం అధికారులు నివేదిక ఇచ్చారు. ఇదే సబ్ డివిజన్ పరిధిలోని మల్లేశ్వరం సామూహిక రక్షిత మంచినీటి పథకంలో భాగంగా ఏర్పాటుచేసిన మైక్రో ఫిల్టర్‌లోని ఫిల్టర్ మీడియాను మార్చటానికి రూ.50 లక్షల జెడ్పీ నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను కూడా అడ్డగోలుగా చేశారన్న అనుమానంతో అప్పటి ఈఈ.. క్వాలిటీ కంట్రోల్ తనిఖీలకు ఆదేశించారు. ఇక్కడ కూడా ఫిల్టర్ మీడియా పనులు పూర్తిస్థాయిలో జరగలేదని నిర్ధారించారు. పనులు సక్రమంగా పూర్తి చేయనందున కాంట్రాక్టర్‌కు చెల్లించే బిల్లులో 30 నుంచి 50 శాతం వరకు రికవరీ చేయాలని ప్రతిపాదిస్తూ ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులకు నివేదిక పంపారు.

అప్పుడు డీఈ.. ఇప్పుడు ఇన్‌చార్జి ఈఈ

ఈ పనులు చేసినపుడు ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారిగా ఉన్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) ప్రస్తుతం లేరు. నాడు అడ్డగోలుగా చెక్‌మెజర్‌మెంట్ చేసిన డీఈ ప్రస్తుతం కృష్ణాజిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఈఈగా వ్యవహరిస్తున్నారు. తాను చేసిన దొంగపనిని ఇప్పుడు ఆయన సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నారు. విజిలెన్స్

మిగతా 6లో..

పోర్టు పనులు వేగవంతం చేయాలి

కలెక్టర్ డీకే బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ, ఆర్డీవో స్వాతితో మంత్రి కొల్లు రవీంద్ర సమీక్ష 6లో

జనసేన పెనమలూరు ఇన్‌చార్జి

సస్పెన్షన్

- బరుల్లో అధిక మొత్తంలో పార్కింగ్
- సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్
- తీవ్రంగా పరిగణించిన అధిష్ఠానం..
- పార్టీ నుంచి తొలగిస్తూ వేటు



ముప్పా రాజా

విజయవాడ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ముప్పా రాజాపై అధిష్ఠానం వేటు వేసింది. ఆయన్ను పార్టీ నుంచి బహిష్కరిస్తూ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ గురువారం ఆదేశాలిచ్చారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా జిల్లాలోని అన్ని మండలాల్లో కోడిపందేలు, గుండాట, పేకాట జోరుగా సాగాయి. ముప్పా రాజా ఆధ్వర్యంలో కంకిపాడులో బరులు ఏర్పాటు చేశారు. ఈ బరుల చుట్టూ జనసేన పార్టీ జెండాలు, పవన్ కల్యాణ్ చిత్రాలతో ఫ్లెక్సీలు కట్టారు. పందేలను వీక్షించడానికి, ఆడటానికి వచ్చిన వాహనదారుల నుంచి భారీగా రుసుము వసూలు చేశారు. కారుకు పార్కింగ్ రూ.200 నిర్ణయించారు. దీనిపై సామాజిక మాధ్యమాల్లో వీడియోలు హల్‌చల్ చేశాయి. నెటిజన్లు, రాజకీయ ప్రత్యర్థులు.. జనసేనపై కామెంట్లు చేశారు. దీనిని అధిష్ఠానం తీవ్రంగా పరిగణించింది. రాజాను పార్టీ నుంచి బహిష్కరిస్తూ ఆదేశాలిచ్చింది. పార్టీ నిర్వహించే ఏ కార్యక్రమాల్లో పాల్గొనవద్దని ఆయనకు స్పష్టం చేసింది.

మారనున్న తరగతి



వచ్చే విద్యాసంవత్సరం నుంచి మార్పులు చేర్పులు

వచ్చే విద్యాసంవత్సరం నుంచి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నిర్వహణలో మార్పులు చోటుచేసుకోనున్నాయి. 117 జీవో ఆధారంగా నూతన విద్యావిధానం అమలు చేస్తున్నామంటూ గత వైసీపీ ప్రభుత్వం ఉన్నత పాఠశాలలకు కిలోమీటరు దూరంలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ విధానాన్ని రద్దుచేసింది. ప్రాథమిక పాఠశాలలను పాత పద్ధతిలోనే కొనసాగించేందుకు అనుమతులు మంజూరుచేసింది. నూతన విద్యావిధానం వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలల పునఃప్రారంభం నుంచి అమల్లోకి వస్తుంది. కాబట్టి వచ్చే ఏడాది నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం తరగతికో టీచర్ ఉండేలా చూస్తామని డీఈవో పీవీజే రామారావు చెబుతున్నారు.

- తరగతికో ఉపాధ్యాయుడు ఉండేలా కసరత్తు
- జిల్లాలోని 18 ప్లస్2 కళాశాలలు రద్దుచేసే యోచన
- 60 మంది విద్యార్థులుంటేనే ప్రాథమికోన్నత పాఠశాలలు
- అంగన్వాడీ, 1, 2 తరగతులతో బేసిక్ ప్రాథమిక పాఠశాలలు
- విద్యాబోధన ఎవరు చేయాలనే అంశంపై సందిగ్ధత

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాలల్లో చేయాల్సిన మార్పులపై విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. అయితే, జిల్లాలో ఈ అంశం ఎంతమేర ముందడుగు పడుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. గతంలో పాఠశాలల విలీనం సమయంలో డీఈవో కార్యాలయంలో స్టాటికల్ విభాగంలో పనిచేసిన సిబ్బందిని ఇటీవల ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. కీలకమైన ఈ విభాగంలో పనిచేసేందుకు వేరెవరూ ముందుకు రావడంలేదు. దీంతో గతంలో జరిగిన పాఠశాలల విలీనం, ప్రస్తుతం చేయాల్సిన మార్పులపై కొత్తగా వచ్చేవారికి త్వరగా అర్థమయ్యే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో ఎన్ని రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తిచేస్తారనే అంశంపై సందిగ్ధం నెలకొంది.

274 ప్రాథమికోన్నత పాఠశాలలు రద్దు కానున్నాయా..?

జిల్లాలో 274 ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయి. వాటిలో 60 మంది లేదా అంతకుమించి 6, 7, 8 తరగతుల్లో పిల్లలు ఉంటే, వాటిని ఉన్నత పాఠశాలలుగా మార్చేందుకు ప్రతిపాదన చేస్తారు. అంతమంది

మిగతా 6లో..

ప్లస్-2 కళాశాలలు రద్దు చేస్తారా?

రెండేళ్ల క్రితం జిల్లాలో 18 ఉన్నత పాఠశాలల్లో బాలికల కోసం ఇంటర్మీడియెట్‌లో వివిధ కోర్సులను ప్రవేశపెట్టారు. గత ప్రభుత్వం ఏడాది పాటు ఈ కళాశాలల్లో అధ్యాపకులను నియమించకుండా, పిల్లలకు పాఠ్యపుస్తకాలు కూడా ఇవ్వకుండా మిన్నకుండిపోయింది. దీంతో 18 కళాశాలల్లోని నాలుగైదు మినహా మిగిలిన వాటిలో బాలికలు ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ఆశించినంతగా చేరలేదు. ఏడాది తరువాత ప్లస్-2 కళాశాలల్లో పనిచేసేందుకు అర్హత ఉన్న ఉపాధ్యాయులను అధ్యాపకులుగా నియమించారు. అయినా ఈ కళాశాలల్లో బాలికలు ఆశించిన స్థాయిలో చేరలేదు. ఈ కళాశాలలను రద్దుచేస్తే అక్కడ పనిచేసే అధ్యాపకులను మళ్లీ ఎక్కడ నియమిస్తారనే అంశంపైనా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. మళ్లీ పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి ఎన్ని మార్పులు చోటుచేసుకుంటాయోనని, ఎంతమంది బదిలీ కావాల్సి వస్తుందోనని ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

పల్లెగూటికి పండగొచ్చె..

- కూటమి పాలనలో రోడ్లకు మోక్షం..
- రూ.24 కోట్లతో నిర్మాణాలు



వృద్ధుడి ఉసురు తీసిన ధూమపానం

- అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన వృద్ధుడు
- సిగరెట్ వెలిగించుకుని నిద్రలోకి..
- భార్య చూసేసరికి మంటల్లో ఆహుతి
- గుడివాడలో ఘటన

6లో


కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మలతో సమీక్షిస్తున్న మంత్రి రవీంద్ర

పోర్టు పనులు వేగవంతం చేయాలి

» మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : బందరు పోర్టు, ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర అధికారులకు సూచించారు. గురువారం ఆర్అండ్బీ అతిథి గృహంలో మచిలీపట్నం నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్ డీకే బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ, ఆర్డీవో స్వాతిలతో సమీక్షించారు. బందరు పోర్టు నిర్మాణం పూర్తవుతున్న దృష్ట్యా మచిలీపట్నంను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు, ఉపాధి అవకాశాలు లభించేందుకు కావలసిన మౌలిక సదుపాయాలను కల్పించాలని కలెక్టర్కు మంత్రి సూచించారు. గిలకలదిండి ప్రాంతంలో ఎంఎస్ఎంఈ పార్కు అభివృద్ధి చేస్తే బాగుంటుందని, అందుకు గల అవకాశాలను పరిశీలించాలన్నారు. ఇందుకు మాస్టర్ ప్లాన్ రూపొందించాలన్నారు. చేతి వృత్తుల వారికి జీవనోపాధి కల్పించేందుకు అవసరమైన శిక్షణతో పాటు యూనిట్ల స్థాపనకు ప్రణాళిక రూపొందించాలన్నారు. మత్స్యకారుల జీవనోపాధి కోల్పోకుండా క్లస్టర్ రూపొందించి పడవల తయారీ యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు. మత్స్యకారులకు శిక్షణా కార్యక్రమాలు కల్పించాలన్నారు. మంగినపూడి బీచ్ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి పరిచేందుకు, బీచ్లో తాగునీటి అవసరాల కోసం డిశాలినేషన్ ప్లాంట్ను ఏర్పాటు చేయాలన్నారు. బందరుకోటలో పురాతన కట్టడాలను పరిరక్షించి హెరిటేజ్ పార్కుగా అభివృద్ధి చేసే అవకాశాలు కల్పించాలన్నారు. నగరంలో పార్కుల సుందరీకరణ చేయాలన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధి చేయాలన్నారు. పది డివిజన్లకు ఒక జిల్లా అధికారిని శానిటేషన్ పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ, ఆర్డీవో స్వాతి తదితరులు పాల్గొన్నారు.


క్రికెటర్ నితీశ్ కుమార్రెడ్డిని వేంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేస్తున్న ఎంపీలు కేశినేని శివనాథ్, సానా సతీష్, తదితరులు

ఎంపీ శివనాథ్ను కలిసిన టీమ్ ఇండియా క్రికెటర్ నితీష్కుమార్ రెడ్డి

వన్టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ని విశాఖకు చెందిన టీమ్ ఇండియా క్రికెటర్ కె.నితీష్ కుమార్రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. గురునానక్ కాలనీలోని ఎంపీ నివాసంలో నితీష్ కుమార్ రెడ్డి గురువారం కలిశారు. శివనాథ్ (చిన్ని)తో పాటు ఏసీఏ కార్యదర్శి, రాజ్యసభ ఎంపీ సానా సతీష్లు నితీష్ కుమార్రెడ్డికి సాదర స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం శాలువాతో సత్కరించి వెంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరించారు. ఈ సందర్భంగా నితీష్ కుమార్ రెడ్డితో ఆస్ట్రేలియాలో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ విశేషాలను పంచుకున్నారు. తొలి టెస్ట్లో ఆస్ట్రేలియా గడ్డపై సెంచరీ సాధించిన నితీష్ను అభినందించారు. ఎంతోమంది క్రీడాకారులకు నితీష్ కుమార్ రెడ్డి స్ఫూర్తిగా నిలిచాడని కొనియాడారు. ఏపీ నుంచి ఏసీఏ తరపున మరింత మంది క్రీడాకారులు ఇండియన్ క్రికెట్, ఐపీఎల్లో ఆడేందుకు యంగ్ క్రికెటర్స్కి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఏసీఏ ఉపాధ్యక్షుడు పి.వెంకట రామ ప్రశాంత్, కోశాధికారి దండమూడి శ్రీనివాస్, కౌన్సిలర్ దంతు గౌరు విష్ణుతేజ్, కె.ముత్యాలరెడ్డి పాల్గొన్నారు.

నితీష్కుమార్ రెడ్డికి లోకేశ్ అభినందన



టీమ్ ఇండియా క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డి ఉండవల్లిలోని నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ను గురువారం కలిశారు. ఆయన వెంట కేశినేని శివనాథ్, సానా సతీష్, తదితరులు పాల్గొన్నారు. నితీష్ కుమార్ రెడ్డిని అభినందించిన నారా లోకేష్ శాలువాతో సత్కరించి, వెంకటేశ్వర స్వామి ప్రతిమను బహూకరించారు. క్రికెట్ విశేషాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో యువ క్రీడాకారులకు సహకారం ఉంటుందని తెలిపారు. నితీష్ కుమార్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని లోకేష్ ఆకాంక్షించారు.

ద.మ.రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్గా రమేశ్ బాధ్యతలు



వన్టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ మధ్య రైల్వేకి ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్గా ఎన్.రమేష్ సికింద్రాబాద్లోని రైలు నిలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ రైల్వేస్ ట్రాఫిక్ సర్వీస్ 1992 బ్యాచ్కు చెందిన రమేష్ నైరుతి రైల్వేలో చీఫ్ క్లెయిమ్ ఆఫీసర్గా పనిచేశారు. 30 సంవత్సరాల ఉద్యోగ జీవితంలో బెంగుళూరు డివిజన్లో సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, రైల్వేమంత్రి వద్ద కో-ఆర్డినేషన్ పబ్లిక్ గ్రీవెన్స్ డైరెక్టర్గా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్గా పనిచేశారు. పలు ఉద్యోగ బాధ్యతలను నిర్వహించారు.

చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్గా పద్మజ..



ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్గా కె.పద్మజ బాధ్యతలు స్వీకరించారు. తొలి మహిళా ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్గా ఆమె గుర్తింపు పొందారు. ఐఆర్టీఎస్ 1991 బ్యాచ్కు చెందిన ఈమె రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్గా విధులు నిర్వహించారు. 30 సంవత్సరాలుగా రైల్వేలో వివిధ విభాగాల్లో వివిధ హోదాల్లో పద్మజ పనిచేశారు. కిందటేడాది జులై నుంచి ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్గా పనిచేసిన ఆమె ప్రయాణికులు, సరుకు రవాణా సేవలను సమర్థవంతంగా నిర్వహించారు. రైల్వే ఆదాయాన్ని పెంచటానికి కృషి చేశారు.

ఆర్టీసీ ఎండీకి జన్మదిన శుభాకాంక్షలు

బస్ స్టేషన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ, డీజీపీ ద్వారకా తిరుమలరావు పుట్టినరోజు సందర్భంగా ఏపీఎస్ఆర్టీసీ కార్మిక పరిషత్ రాష్ట్ర కమిటీ ఆయనను గురువారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి. శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, మరికొందరు ఆర్టీసీ ఎండీకి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్మిక పరిషత్ రాష్ట్ర కోశాధికారి, సీసీఎస్ పాలకవర్గ సభ్యుడు కోసూరి సురేంద్ర, తదితరులు ఉన్నారు.


డీజీపీ ద్వారకా తిరుమలరావుకు మొక్క బహూకరిస్తున్న ఆర్టీసీ కార్మిక నేతలు

పల్లెగూటికి పండగొచ్చె..

కూటమి పాలనలో రహదారులకు మోక్షం.. రూ.24కోట్లతో గ్రామాల్లో రోడ్ల నిర్మాణం


పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నిర్మిస్తున్న రహదారి

(ఆంధ్రజ్యోతి-పామర్రు)
కూటమి ప్రభుత్వం అధికారంలో రావడంతోనే గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించడంతో పల్లెగూటికి పండగ వచ్చినట్టుగా కనిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం కేవలం బటన్ నొక్కడంతోనే సరిపెట్టి అభివృద్ధిని విస్మరించిందనే అపవాదును మూటగట్టుకుంటే.. కూటమి సర్కారు సంక్రాంతి నాటికి గుంతలులేని రహదారులే లక్ష్యంగా ముందుకు సాగుతూ ప్రజల మన్ననలు పొందుతుంది. దానిలో భాగంగానే పామర్రు నియోజకవర్గంలోని ఐదుమండలాల్లో 'పల్లెపండుగ' పథకం ద్వారా రూ.24 కోట్లు వెచ్చించి ప్రతి గ్రామంలో 398 సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టి శరవేగంగా పనులు పూర్తి చేసింది. సంతబజారు నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వెళ్లే దారితో పాటు పలు నూతన రోడ్లు వేశారు. అత్యంత అధ్వానస్థితిలో ఉన్న రోడ్లకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చి శరవేగంగా పనులు పూర్తిచేయడంతో స్థానిక ప్రజలు ఎన్నాళ్ల కెన్నాళ్లకు రోడ్డుకు మోక్షం.. అంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చాల ఆనందంగా ఉంది



- కమ్మిలి నాగ అనిల్ కుమార్

దశాబ్ద కాలం నుంచి పట్టించుకోకుండా ఉన్న ఈ రహదారిని కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత నివ్వడం నిజంగా చాల ఆనందంగా ఉంది. ఈ రహదారిలోనే నాలుగు ఆసుపత్రులు, పచారీ దుకాణాలతో పాటు ఇతర వ్యాపారాలు ఉన్నా గత ప్రభుత్వం పట్టించుకోక పోవడవం దురదృష్ట కరం. రోడ్ల పక్కన మార్జిన్లలో రబ్బీసు తోలాలి.

రైతుల ఇబ్బందులు తొలగినట్టే

మురళి, కౌలు రైతు

రైతులు తమ ఉత్పత్తులను పొలాలనుంచి ఇంటికి తీసుకెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. గోతుల రోడ్డులో చాల కాలం ఇబ్బందులు చూసాం. కొత్త ప్రభుత్వం చొరవతో రైతులఇబ్బందులు తొలగాయి. ప్రజల సమస్యలు పట్టించుకునే ప్రభుత్వం రావడం చాల సంతోషంగా ఉంది.

గణతంత్ర వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

» సీఎస్ వీడియో కాన్ఫరెన్స్లో కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్బాబు వెల్లడి


వీడియో కాన్ఫరెన్స్లో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు

కృష్ణలంక, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్కు వివరించారు. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో గురువారం వీడియోకాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబులు వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొని గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 26న ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రిపబ్లిక్ డే పరేడ్ చీఫ్ కో-ఆర్డినేటర్ సంబంధిత విభాగాల సంస్థల సమన్వయంతో ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి తదితర ప్రముఖులు పాల్గొంటారని, ఇందుకు మినిట్ టు మినిట్ను అనుసరించి ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుచర్యలు తీసుకొంటామన్నారు. ప్రధాన వేదికను ప్రొటోకాల్ నిబంధనలకు అనుగుణంగా రూపొందించి, స్టేడియంలో పోర్ట్ వాల్ డిజైన్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకొంటామన్నారు. పోలీసు కమిషనర్ పి.రాజశేఖర బాబు మాట్లాడుతూ, వేడుకల్లో పాల్గొనేందుకు విచ్చేసే వీఐపీ వాహనాలకు ప్రత్యేక ప్రాక్సిమేట్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో వేడుకల రిహార్సల్స్ నిర్వహించాలని, ఫుల్ డ్రెస్ రిహార్సల్స్తో పరేడ్ను సిద్ధం చేస్తామన్నారు. వీవీఐపీ, వీఐపీలు ఇతర ప్రజాప్రతినిధులకు ప్రత్యేక సీట్లను కేటాయించేలా చర్యలు తీసుకొంటామన్నారు. వేడుకల్లో ఆర్మీ కంటింజెంట్ రాష్ట్ర పోలీసు బెటాలియన్స్, ఎన్సీసీ స్కౌట్ అండ్ గైడ్స్ పోలీసు బ్యాండ్ వంటి విభాగాలు కవాతులో పాల్గొంటారన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్కు వివరించారు.

ప్రజల భాగస్వామ్యంతో ప్రమాదాలకు చెక్

» సమష్టి కృషితో ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం
» రహదారి భద్రతా మాసోత్సవాలలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి
» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ


రోడ్డు భద్రతా వారోత్సవాల ప్రచార పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, డీటీసీ మోహన్

కృష్ణలంక, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదాల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం.. సమష్టి కృషితో ప్రజల్లో అవగాహన కల్పించి ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం.. రహదారి భద్రతా మాసోత్సవాలలో ప్రజలను పెద్దఎత్తున భాగస్వాములను చేసేందుకు కృషి చేద్దాం.. అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, నగర పోలీసు కమిషనర్ పి.రాజశేఖరబాబులు తెలిపారు. రవాణాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి నెలరోజుల పాటు జిల్లాలో నిర్వహించనున్న రహదారి భద్రతా మాసోత్సవాల పోస్టర్లు, కరపత్రాలు, బుక్లెట్స్ బ్యానర్లను గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ జి.లక్ష్మీశ, పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు, డీటీసీ ఎ.మోహన్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రహదారి ప్రమాదాల పట్ల ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతీ ఏడాది కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా రహదారి భద్రతా మాసోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా ఈనెల 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు నెలరోజుల పాటు జిల్లావ్యాప్తంగా మాసోత్సవాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ప్రమాదాల నివారణకు ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేలా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. నగర పోలీసు కమిషనర్ పి.రాజశేఖరబాబు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసుశాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకొంటున్నట్టు తెలిపారు. ప్రమాదాల నివారణలో ప్రజలకు అవగాహన కల్పించి వారిని భాగస్వాములను చేసినప్పుడే సత్ఫలితాలు వస్తాయన్నారు. జిల్లా రవాణాశాఖ అధికారి ఎ.మోహన్ మాట్లాడుతూ, రోడ్డుభద్రతపై అవగాహన కల్పించేందుకు ర్యాలీలు, అవగాహన సదస్సులు, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా యంత్రాంగం సహకారంతో పోలీసు, వైద్య ఆరోగ్య, ట్రాన్స్పోర్టు, ఆర్అండ్బీ, జాతీయ రహదారులు తదితర శాఖల సమన్వయంతో స్వచ్ఛంద సంస్థలు ప్రజలను భాగస్వాములను చేసి భద్రతా మాసోత్సవాలను విజయవంతం చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రవాణాశాఖ అధికారులు ఆర్.ప్రవీణ్, కె.వెంకటేశ్వరరావు, కె.శివరాంగౌడ్, ఉదయ్ శివప్రసాద్, డీవీ రమణ, ఎస్ఎఎస్ వర్మ, కేడీవీ రవికుమార్, బి.శ్రావణి, సత్యనారాయణ, రవాణా ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు, డిప్యూటీ డీఎంహెచ్వో జె.ఇందుమతి పాల్గొన్నారు.

సొసైటీ పాలకవర్గంలో చోటు కల్పించండి

» నియోజకవర్గ తెలుగుయువత డిమాండ్
» రిజర్వేషన్లలో మార్పుతో పెరుగుతున్న ఆశావహులు

(ఆంధ్రజ్యోతి-తిరువూరు) : నియోజకవర్గ పరిధిలోని మొత్తం 34 సహకార సంఘాల్లో తొలుత కేటాయించిన రిజర్వేషన్లలో మార్పులు చోటుచేసుకోవడంతో సొసైటీ పాలకవర్గంలో ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. వివిధ సొసైటీలకు సంబంధించి ఇటీవల స్థానికంగా ఏఏ సొసైటీలు ఏ సామాజికవర్గానికి కేటాయించాలనే విషయంపై డ్రా తీశారు. తిరువూరు కేడీసీసీ బ్యాంక్ పరిధిలోని ఎనిమిది సహకార సంఘాల్లో లక్ష్మీపురం సొసైటీ జనరల్ మహిళ, నడింతిరువూరు, వావిలాల, ముష్టికుంట్ల, టేకులపల్లి జనరల్కు, మునుకుళ్ల బీసీ జనరల్, మల్లేల, చింతలపాడు, సొసైటిలలో ఒక సొసైటీని ఎస్సీ, ఒకటి బీసీ లేదా జనరల్కు కేటాయించేలా స్థానిక నాయకత్వం నిర్ణయించింది. నియోజకవర్గంలో మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో ఆయా సొసైటీలకు ఎంపిక చేసిన అభ్యర్థుల మార్పు అనివార్యమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో తిరువూరు కేడీసీసీ బ్యాంక్ పరిధిలో ఎనిమిది సహకార సంఘాలు, కంభంపాడు పరిధిలో ఏడు సొసైటీలు, గంపలగూడెం పరిధిలో 12 సొసైటీలు, విస్సన్నపేట పరిధిలో ఏడు సహకార సంఘాలు ఉండగా మొత్తం 34 సహకార సంఘాల్లో కొన్ని మినహా మిగిలిన సొసైటీల్లో అభ్యర్థుల్ని మార్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది.

తెలుగుయువతకు ప్రాధాన్యత కల్పించండి..

నియోజకవర్గంలోని నామినేటెడ్ పోస్టుల్లో తెలుగుయువతకు ప్రాధాన్యత ఇవ్వాలనే నినాదం బలంగా వినిపిస్తున్నది. పార్టీ కష్టకాలంలో వెన్నుదన్నుగా నిలిచిన తెలుగు యువతకు నామినేటెడ్ పోస్టుల్లో సముచితస్థానం కల్పించాలని, నియోజకవర్గ తెలుగుయువత డిమాండ్ చేస్తున్నది. పార్టీ అధిష్టానం తెలుగుయువతకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలనే డిమాండ్ గట్టిగా వినిపిస్తున్నది.

తప్పుకోడానికా..?

(5వ పేజీ తరువాయి)

నివేదికనే తప్పుబట్టారు. ఏఈ లేని సమయంలో అప్పట్లో తనిఖీలు జరిగాయని ఆరోపిస్తూ.. మళ్లీ తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాలని క్వాలిటీ కంట్రోల్ అధికారులకు లేఖ రాశారు. అయితే, క్వాలిటీ కంట్రోల్ అధికారులు రాజీ పడలేదు. గతంలో ఏవైతే నిర్ధారించారో అవే అంశాలను పొందుపరుస్తూ ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ) కార్యాలయానికి నివేదిక ఇచ్చారు.

అదో కట్టుకథ

విజిలెన్స్ రిపోర్టు వ్యతిరేకంగా రావటంతో ఇన్చార్జి ఈఈ కంగుతిన్నారు. అప్పట్లో అడ్డగోలుగా చెక్మెజర్మెంట్ చేసిన తన బండారం బయట పడుతుందన్న ఉద్దేశంతో కట్టుకథ అల్లారు. డ్యామేజీ అయిన టేపులను వాడటం వల్ల ఎంబుక్లో చేయని పనులను నమోదు చేయాల్సి వచ్చిందన్న వాదన తీసుకొచ్చారు. ఎంబుక్ లో నమోదు చేసిన వివరాలను మార్చటానికి వీలుగా కృష్ణాజిల్లా కలెక్టర్కు ఏకంగా నోట్ఫైల్ పెట్టారు. ఇక్కడే ఇన్చార్జి ఈఈ బండారం బయటపడింది. ఎంబుక్లో తప్పుగా నమోదైతే.. రీ రికార్డింగ్ చేయటానికి ఆర్డబ్ల్యూఎస్ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ)కు లేదా ఈఎన్సీకు నోట్ఫైల్ పెట్టాలి. ఇవేమీ చేయకుండా కలెక్టర్కు నోట్ఫైల్ పెట్టారు. తమ ఉన్నతాధికారులకు పెడితే అసలు విషయం తెలుస్తుందనే తెలివిగా కలెక్టర్కు పెట్టారు. కలెక్టర్ కూడా ఆ నోట్ఫైల్ను ఆమోదించారు. కలెక్టర్ ఆదేశాలను అనుసరించి ఇన్చార్జి ఈఈ హోదాలో తనకు తానుగా ఎంబుక్లో ఎంట్రీలను రీరికార్డింగ్ చేయటానికి వీలుగా ప్రొసీడింగ్స్ ఇచ్చారు. వీటిప్రకారం ఎంబుక్, ఇతర రికార్డుల్లో నమోదు చేసిన వాటన్నింటినీ సరిచేస్తారు. దీంతో తాను చేసిన తప్పును సరిచేసుకునే అవకాశం ఏర్పడుతుందని ఇన్చార్జి ఈఈ ఆలోచన.

మారనున్న తరగతి

(5వ పేజీ తరువాయి)

పిల్లలు లేకుంటే మూడు కిలోమీటర్ల దూరంలోని ఉన్నత పాఠశాలలో ఈ ప్రాథమికోన్నత పాఠశాలలను విలీనం చేయనున్నారు. ప్రధాన కాల్వలు, రైల్వేట్రాక్లు, జాతీయ రహదారులు, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని పాఠశాలలకు మినహాయింపు ఇస్తారు. పిల్లల సంఖ్య తక్కువగా ఉన్న కారణంగా జిల్లాలో ఎన్ని ప్రాథమికోన్నత పాఠశాలలు రద్దవుతాయనేది విద్యాశాఖ అధికారులు నిర్ణయించాల్సి ఉంది.

మార్పులు, ఇబ్బందులు ఇలా..

జిల్లాలో 1,109 ప్రాథమిక పాఠశాలలున్నాయి. వీటిలో ప్రభుత్వ ఆదేశాలతో మార్పులు చేయనున్నారు. శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్ పేరుతో నాలుగేళ్లలోపు వయసున్న పిల్లల కోసం ఐసీడీఎస్ ద్వారా (పీపీ 1, పీపీ 2) పాఠశాలలను నడుపుతారు. వీటిని కొనసాగిస్తూనే ఫౌండేషనల్ స్కూల్ పేరుతో నాలుగేళ్ల పిల్లలతో పాటు 1, 2 తరగతులతో కలిపి కొన్ని పాఠశాలలను నడుపుతారు. ఈ పాఠశాలల్లో 1, 2 తరగతుల్లో విద్యాబోధన కోసం ఎస్జీటీలను నియమిస్తారా, అంగన్వాడీ టీచర్లతో పాఠాలు బోధిస్తారా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంటున్నారు. బేసిక్ ప్రైమరీ పాఠశాలల్లో నాలుగేళ్ల పిల్లలతో పాటు 1 నుంచి 5వ తరగతి వరకు కొన్ని పాఠశాలలను ఏర్పాటు చేస్తారు. గతంలో 3 నుంచి 8వ తరగతి వరకు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను మార్పుచేసి మోడల్ ప్రైమరీ స్కూల్స్గా మార్చనున్నారు. స్థానిక పరిస్థితులను బట్టి నాలుగేళ్లలోపు పిల్లలతో పాటు 1 నుంచి 5వ తరగతి వరకు పాఠశాలలను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఉన్నత పాఠశాలలు 3 నుంచి 10వ తరగతి వరకు నడుస్తుండగా, 3 నుంచి 5వ తరగతి వరకు మినహాయిస్తారు. 6 నుంచి 10వ తరగతి వరకు మాత్రమే ఉన్నత పాఠశాలలను కొనసాగిస్తారు. ఈ ప్రక్రియ మొత్తంగా అమలు కావాలంటే విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో కసరత్తు చేయాలి. ఈ తరగతుల విలీనం తరువాత మిగులుబాటుగా ఉన్న ఉపాధ్యాయులను ఎలా వినియోగించుకోవాలనే అంశంపైనా విద్యాశాఖ అధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

వృద్ధుడి ఉసురు తీసిన ధూమపానం!


తీవ్రగాయాలతో వెంకటేశ్వరరావు

గుడివాడ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ధుమపానానికి బానిసైన వృద్ధుడు చివరకు సిగరెట్ మంటలకే ఆహుతయ్యాడు. ఈ ఘటన గుడివాడలో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన ప్రకారం.. పట్టణంలోని ద్రోణాదుల వారి వీధికి చెందిన చల్లా వెంకటేశ్వరరావు(71)కు ధూమపానం అలవాటుంది. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మంచానికి పరిమితమయ్యాడు. బుధవారం ఉదయం సిగరెట్ వెలిగించి నిద్రలోకి జారుకున్నాడు. టిఫిన్ నిమిత్తం వెంకటేశ్వరరావు భార్య బయటకు వెళ్లింది. తిరిగి వచ్చి చూసేసరికి భర్త మంటల్లో చిక్కుకుని ఉండటాన్ని గమనించింది. అప్పటికే తీవ్ర గాయాలపాలైన వెంకటేశ్వరరావును స్థానికుల సహాయంతో ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరింత మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించాలని వైద్యులు సూచించగా, అప్పటికే వెంకటేశ్వరరావు మృతి చెందాడు. వెంకటేశ్వరరావుకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ సీఐ సీహెచ్ నాగప్రసాద్ తెలిపారు.

యువకుడి మృతిపై రాజకీయం!

» అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

చందర్లపాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : సంచలనం కలిగించిన నల్లాని వీరమణితేజ మృతి రాజకీయ రంగు పులుముకుంది. ముప్పాళ్ల గ్రామానికి చెందిన వైసీపీ నేత నల్లాని సాయి కుమారుడు వీరమణితేజ బుధవారం అనుమానాస్పద స్థితిలో మరణించిన సంగతి విదితమే. గురువారం వీరమణితేజ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ దుర్గామహేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే పలువురుని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు ఆయన తెలిపారు. గురువారం మృతదేహాన్ని వైసీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాశ్, మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, ఇంటూరి చిన్న తదితరులు సందర్శించి నివాళులర్పించారు. వీరమణితేజ తలపై రాడ్డుతో కొట్టినట్టు బలమైన గాయాలు ఉన్నాయని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా పోలీసులు విచారణ జరపాలని వారు కోరారు. చందర్లపాడులో కోడిపందేల వద్ద ఘర్షణే హత్యకు కారణమని వారు ఆరోపించారు.

శవరాజకీయాలు మానుకోవాలి..

వైసీపీ శవ రాజకీయాలకు పాల్పడుతోందని టీడీపీ మండల అధ్యక్షుడు మేకల సుధాకర్ మండిపడ్డారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో చిచ్చుపెట్టాలని వైసీపీ నేతలు కుట్ర చేస్తున్నారన్నారు. జరిగిన ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారని, నిజాలు నిగ్గు తేలుతాయన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకోక పోతే ప్రజలు మరో మారు బుద్ధి చెపుతారని హెచ్చరించారు.

దివ్యాంగుడి దారుణ హత్య


యర్రంశెట్టి ఆంజనేయులు

జగ్గయ్యపేట : పట్టణంలో సత్యనారాయణపురం పురపాలకసంఘ కాంట్రాక్ట్ కార్మికుడు, దివ్యాంగుడు యర్రంశెట్టి అంజనేయులు (45) గురువారం రాత్రి దారుణహత్యకు గురయ్యాడు. సీఐ పి.వెంకటేశ్వర్లు తెలిపిన సమాచారం ప్రకారం.. రాత్రి 10గంటల సమయంలో యర్రంశెట్టి తననివాసంలో ఉండగా, అదే ప్రాంతానికి చెందిన బెల్లంకొండ నరేష్ గొడ్డలితో తలపై దాడికి పాల్పడ్డాడు. వెంటనే స్థానికులు అతడ్ని జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు పేర్కొన్నారు. యర్రంశెట్టి అవివాహితుడు కాగా వివాహేతర సంబంధమే హత్యకు కారణమని భావిస్తున్నారు. గతంలో జిల్లా వైసీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా, సోషల్ మీడియాలో చురుకుగా పనిచేశాడు. అదే సమయంలో పురపాలకసంఘ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుడిగా ఉద్యోగం సంపాదించాడు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీడీపీలో చేరాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నట్టు చెప్పారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 515



సంక్రాంతి పోటీల్లో విజేతలకు బహుమతులు

పెనమలూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా పోరంకి విజ్ఞాన్ భారత్ ఉన్నత పాఠశాలలో మండల సీపీఎం, సీఐటీయూ, డీవైఎఫ్ఐ యువజనసంఘం, ఐద్వా మహిళా సంఘం, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో జరిగిన ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. గురువారం పాఠశాలలో స్థానిక నేతలు అనుమోలు ప్రభాకరరావు విజేతలను అభినందించి బహుమతులు అందజేశారు. పాఠశాల డైరెక్టర్ శేషాద్రి రావు, ఎస్కే కాసిం, ఉప్పాడ త్రిమూర్తులు, పుసులూరి పాతాళలక్ష్మి, మస్తాన్‌వలి, పుసులూరి లక్ష్మీనారాయణ, విసం సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విజేతకు బహుమతి అందిస్తున్న అనుమోలు


ఉయ్యూరు కొత్త వంతెన సెంటర్ సమీపాన నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న బిల్డింగ్

నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు

● పట్టించుకోని ఉయ్యూరు నగరపంచాయతీ అధికారులు ● స్థానిక ప్రజాప్రతినిధుల అండతో యథేచ్ఛగా అడ్డగోలు కట్టడాలు

ఉయ్యూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉయ్యూరు నగరపంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. నిబంధనలు గాలికొదిలి రోడ్లపైకి చొచ్చుకు వస్తూ పలు అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నా నగరపంచాయతీ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతర్గత రోడ్లతో పాటు నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారుల్లో సైతం నిబంధనల ప్రకారం సెట్ బ్యాక్ స్థలం వదలకుండా స్థానిక, వార్డు ప్రజా ప్రతినిధుల అండతో కట్టడాలు జరిగిపోతున్నాయి. అధికారులు మాత్రం తమకేం సంబంధం లేదన్నట్టుగా వ్యవహరించడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రావిచెట్టు బజార్, కాటూరు రోడ్డులో బహుళ అంతస్థుల భవనాలు రాజకీయనాయకుల పలుకుబడితో అక్రమంగా నిర్మిస్తున్నా అధికారులు అడ్డుకోకపోవడం విశేషం. కొన్నిచోట్ల వార్డు ప్రజా ప్రతినిధులకు ఎంతో కొంత ముట్ట చెప్పి ప్రసన్నం చేసుకుని నిర్మాణాలు చేస్తున్నట్టు సమాచారం. రావి చెట్టు బజార్‌లో ఓ మహిళా ప్రజా ప్రతినిధి భర్తను భవనం నిర్మిస్తున్న వ్యక్తి ప్రసన్నం చేసుకుని నిర్మాణ పనులు కొనసాగిస్తున్నట్టు తెలుస్తోంది. కాటూరు రోడ్డులో సైతం నిబంధనలకు విరుద్ధంగా అక్రమ, అడ్డగోలు నిర్మాణాలు జరుగుతున్నాయి.


ఉయ్యూరు ప్రధాన సెంటర్‌లో విజయవాడ బస్టాప్ వద్ద ఖాళీలేక రింగ్ సర్కిల్ వద్ద నడిరోడ్డుపై నిలిపిన బస్సు

బస్టాపుల్లో ఆటోలు, వాహనాలు

● పట్టించుకోని పోలీసులు
● అడ్డదిడ్డంగా ఆటోల నిలిపివేత ● ట్రాఫిక్‌కు అంతరాయం

ఉయ్యూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉయ్యూరులో బస్టాప్‌లు, ప్రధాన సెంటర్లలో ఎక్కడి పడితే అక్కడ ఆటోలు నిలపడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయంతో పాటు బస్టాప్‌లు ఖాళీలేక నడిరోడ్డుపై నిలుపుతున్న బస్సుల వల్ల పాదచారులకు అసౌకర్యం కలుగుతుంది. బస్సులు ఆగు స్థలం, ఏవిధమైన వాహనాలు నిలపరాదని పోలీసుల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినప్పటికిఆటోలు, ఇతర వాహనాలు నిలుపుతున్నా పట్టించుకోవడం లేదు. దీంతో ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలిపి ప్రయాణికుల కోసం ఎదురు చూస్తూ వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నారు.బస్టాప్ వద్ద ఆటోలు ఇతర వాహనాలు నిలపడంతో బస్సులు ఆపేందుకు ఖాళీలేక స్టాప్‌కు దూరంగా రింగ్ సర్కిల్‌లో ఆపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. దీంతో మార్కెట్‌వైపు నుంచి, శివాలయం రోడ్డు నుంచి వచ్చే వాహనాలు నిలిచి ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. పామర్రు, వీరంకిలాకు వైపు వెళ్లే ఆటోలు కాటూరు రోడ్డు సర్కిల్, బందరు రోడ్డులో అడ్డంగా నిలుపుతున్నా పోలీసులు పట్టించుకోపోవడం పట్ల వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు స్పందించి ఆటోల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ముప్పా రాజా సస్పెన్షన్‌పై రచ్చ

కంకిపాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పెనమలూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ముప్పా రాజా సస్పెండ్ ఇప్పుడు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. జనసేన పార్టీ కాన్ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్ హెడ్ వేములపాటి అజయ్‌కుమార్ నుంచి గురువారం విడుదలైన ముప్పా రాజా సస్పెన్షన్ లెటర్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. సంక్రాంతి సంబరాల పేరుతో ఏర్పాటు చేసిన కోడి పందేలు ప్రాంగణం వద్ద జనసేన పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం జనసేన పార్టీ విధి విధానాలకు వ్యతిరేకం అని అన్నారు. ఈ నేపథ్యంలో ముప్పా రాజాను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నామని అజయ్‌కుమార్ ప్రకటించారు.

నియోజకవర్గంలో చర్చనీయాంశం

పార్టీ స్థాపించిన నాటి నుంచి పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించిన ముప్పా రాజాను ఈ విధంగా సస్పెండ్ చేయడం సరికాదని అటు జనసైనికులు, ఇటు వీరమహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోడి పందేలు, పేకాట వంటి వాటిల్లో పాల్గొనకూడదు అంటే ముందుగా పార్టీ కార్యాలయం నుంచి ఒక నోట్ విడుదల చేయాల్సింది కదా అని ప్రశ్నిస్తున్నారు. అదీ కాని పరిస్థితుల్లో షోకాజ్ నోటీసు ఇవ్వకుండా సస్పెండ్ చేయడం సరైన పద్ధతి కాదన్న విమర్శలు సర్వత్ర వ్యక్తం అవుతున్నాయి.

పార్టీలకు అతీతంగా మద్దతు

పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజాను జనసేన పార్టీ సస్పెండ్ చేయడంతో ఆయనకు జనసేన, టీడీపీ, బీజేపీ నుంచి మద్దతు లభిస్తోంది. ఒక్క కోడి పందేల ప్రాంగణం వద్ద జనసేన పార్టీ జెండాలు, ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తే పార్టీ కోసం శ్రమించిన వారిని ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా సస్పెండ్ చేస్తారా అంటూ పార్టీ నిర్ణయాన్ని పార్టీలకతీతంగా విమర్శిస్తున్నారు.

జీతాలు ఇప్పించండి మహాప్రభో..! ఎమ్మెల్యేకు వినతి

పెనమలూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): 3 నెలలుగా తాము జీతాల కోసం ఎదురు చూస్తున్నామని. అయినా సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో తాము సమ్మె బాట పట్టామని తడి పొడి చెత్త వ్యాన్ల డ్రైవర్లు స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు గురువారం వినతిపత్రం ఇచ్చారు. 42మంది వ్యాన్ డ్రైవర్లకు జీతాలు 3 నెలలుగా పెండింగ్ పడడంతో తాము కుటుంబాలను గడుపుకోలేక పోతున్నామని వినతిపత్రంలో వాపోయారు. సానుకూలంగా విన్న ఎమ్మెల్యే మునిసిపల్ కమిషనరుతో చర్చించి వీలయినంత త్వరలో జీతాలు ఇప్పించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉప్పాడ త్రిమూర్తులు, ఎస్కే మస్తాన్‌వలి, నరసింహారావు, వి. సురేష్, కె.రాంబాబు, రవికుమార్, పి.లింగయ్య గౌడ్, శ్రీహరి, సత్రం శ్రీను తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న చెత్త వ్యాన్ల డ్రైవర్లు


గొడవర్రులో ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఇంటింటి సర్వేను సద్వినియోగం చేసుకోండి

కంకిపాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉప్పలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుధా ప్రసుజా అన్నారు. మండలంలోని గొడవర్రు గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ ప్రసూజ మాట్లాడుతూ మండలంలోని గొడవర్రు గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి అవసరమైన మందులు పంపిణీ చేస్తామన్నారు. ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


ఆకునూరు బీసీ కాలనీ వద్ద జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డు వెంబడి పేరుకుపోయిన చెత్తకుప్ప

డంపింగ్ యార్డుల్లా హైవే, సర్వీస్‌రోడ్డు

ఉయ్యూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉయ్యూరు మండల పరిధిలో హైవే, సర్వీస్ రోడ్డుల్లో చెత్తకుప్పలు పేరుకుపోయి డంపింగ్‌యార్డులను తలపిస్తున్నాయి. హైవే వెంబడి ఆకునూరు, వెంకటాపురం, ఆనందపురం, గండి గుంట గ్రామాల్లో సర్వీస్ రోడ్డు పక్కన చెత్త డంపింగ్ చేసి తొలగించకపోవడంతో కుళ్లి దుర్గంధం వ్యాపిస్తోంది. చెత్త గాలికి లేచి రోడ్డుపై వెళ్లేవారిపై పడుతోంది. ఆకునూరు బీసీ కాలనీ వద్ద ఎన్నోరోజులుగా చెత్తపేరుకుపోగా పంచాయతీ సిబ్బంది, స్థానికులు చెత్త తీసుకొచ్చి పోస్తున్నారు. గండిగుంట ఫ్లై వోవర్ సమీపాన, గండిగుంట సెంటర్‌లో సర్వీస్ రోడ్డు పక్కన చెత్త కుప్పలు పేరుకుపోయాయి. పరిసర ప్రాంతాల్లో నివసించే వారు కూడా చెత్త తెచ్చి అక్కడే పోస్తున్నారు. కాటూరు రోడ్డులో ఆర్డీవో కార్యాలయం గేటు ముందు చెత్తకుప్ప దర్శనమిస్తోంది.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఉంగుటూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): చెన్నై-కోల్‌కతా జాతీయరహదారిపై గన్నవరం ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ గుర్తుతెలియని వ్యక్తి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. గన్నవరం ఎస్సై శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద సోమవారం సాయంత్రం 6గంటల సమయంలో సుమారు 50ఏళ్ల వయసుగల గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి ఏలూరువైపు వేగంగా వెళ్తున్న వ్యాన్ ఢీకొంది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బాధితుడిని పోలీసులు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించటంతో మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి సమాచారం తెలిసిన వారు గన్నవరం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు సాయిబాబు ఎంపిక



ఉంగుటూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఒడిషా రాష్ట్రంలోని పూరి నగరంలో ఈనెల 17, 18, 19తేదీల్లో జరగనున్న సీనియర్ పురుషుల షూటింగ్ బాల్ పోటీలకు గోగులమూడి సాయిబాబు ఎంపికైనట్లు కృష్ణాజిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు అట్లూరి రాజశేఖర్ తెలిపారు. ఈసందర్భంగా సాయిబాబును కృష్ణాజిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ సభ్యులు, జిల్లాలోని ప్రముఖ క్రీడాకారులు, క్రీడాసంఘ నాయకులు అభినందించారు.


రామన్నగూడెంలో మినీ గోకులం షెడ్‌ను ప్రారంభిస్తున్న టీడీపీ నేతలు శ్రీనివాసరావు, సర్పంచ్ వీరాంజనేయులు, వడ్లమూడి నాని, తదితరులు

మినీ గోకులంతో రైతుకు చేయూత

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ అభివృద్ధి చెందడం ద్వారా రైతు ఆర్థికాభివృద్ధికి సహకారమందుతుందని అందుకే మినీ గోకులం పథకం రైతుకు చేయూతనిస్తుందని సర్పంచ్ వీరాంజనేయులు, మాజీ సర్పంచ్ ఆర్నేపల్లి సూరిబాబు, జనసేన వీరమహిళ సింగవరపు సూర్యావతి వేర్వేరు కార్యక్రమాల్లో అన్నారు. రామన్నగూడెం. పెరికీడు, ఉమామహేశ్వరపురం గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ నిధుల ద్వారా నిర్మించిన మినీ గోకులాలను గురువారం ప్రారంభించారు. రామన్నగూడెంలో 2 మినీ గోకులాలను టీడీపీ నేతలు శ్రీనివాసరావు, వడ్లమూడి నాని, దాసు, కృష్ణ, రాఘవ పరిశీలించారు. ఉమామహేశ్వరపురంలో పాండురంగారావు, శ్రీనివాసరావు, అచ్చియ్య. శివ, రవి తదితరులు పాల్గొన్నారు. పెరికీడులో 2 మినీ గోకులాల ప్రారంభంలో లంక రవితేజ, శివకుమారి, తదితరులు పాల్గొన్నారు.

తంబి వర్ధంతి మహోత్సవాలు విజయవంతం

● సహకరించిన అందరికీ కృతజ్ఞతలు
● తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ రెవ.ఫాదర్ జోసఫ్ పాలడుగు

ఉంగుటూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలో సుప్రసిద్ధ కతోలికా పుణ్యక్షేత్రంగా పేర్గాంచిన కృష్ణాజిల్లా, ఉంగుటూరుమండలం, పెదఅవుటపల్లిలోని బ్రదర్ జోసఫ్ తంబి పుణ్యక్షేత్రంలో ఈనెల 13నుండి 15వరకు(మూడు రోజులపాటు) అత్యంత వైభవంగా జరిగిన తంబి 80వ వర్ధంతి మహోత్సవాలు(తిరునాళ్లు)విజయవంతం చేయడంలో సహకరించిన అందరికీ తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ రెవ.ఫాదర్ జోసఫ్ పాలడుగు కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం, ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు, భక్తులకు విశేష సేవలందించిన గురువులు, వాలెంటీర్లు, గుడిపెద్దలు, సంఘపెద్దలు, యూత్ మరియు మరియదళ సభ్యులు, కన్యాస్త్రీలు, స్థానిక ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. యాత్రీకుల కోసం 24గంటలూ ప్రత్యేక సర్వీసులు నడిపిన ఆర్టీసీ అధికారులతోపాటు ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలతో గట్టి బందో బస్తు నిర్వహించిన పోలీసు అధికారులను, తాగునీరు, శానిటేషన్, మెడికల్, ఫైర్, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా నిరంతరం పర్యవేక్షణ చేసిన అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. మూడురోజులు క్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసేలా పలు ప్రదర్శనలు నిర్వహించి భక్తులను విశేషంగా అలరించిన గాయకులు, కళాకారులకు అభినందనలు తెలియజేశారు. మీడియాకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.


వలంటీర్లను అభినందిస్తున్న ఫాదర్ జోసఫ్

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.500

రేపు, ఎల్లుండి త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

మచిలీపట్నం టౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): త్యాగరాజ సంగీత విద్యాపీఠం ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో వివేకానంద మందిరంలో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్టు పీఠం అధ్యక్షుడు బీహెచ్‌వీఎల్ రాధాకృష్ణమూర్తి తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాల్లో రాష్ట్రంలోని సంగీత విద్వాంసులు పాల్గొని త్యాగరాజస్వామి కీర్తనలను గానం చేస్తారన్నారు. మల్లాది శివానంద సర్వేపల్లి సిస్టర్స్‌తో పాటు ప్రముఖ సంగీత విద్వాంసులు త్యాగరాజస్వామి ఘనరాగ పంచకీర్తనలు గానం చేస్తారన్నారు. వర్ధమాన యువకళాకారులు తమ గానాన్ని వినిపిస్తారన్నారు.

టౌన్‌హాలులో యువతకు

ఉపాధి శిక్షణ కేంద్రం

● ఏర్పాటు చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర యోచన

మచిలీపట్నం టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : టౌన్‌హాలులో యువతకు ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర యోచిస్తున్నారు. గురువారం టౌన్‌హాలులోని వివిధ విభాగాలను ఆయన పరిశీలించారు. పూర్వ కృష్ణాక్లబ్‌లోని గదులను పరిశీలించారు. శిథిలమైన టౌన్‌హాలు పునర్నిర్మించడంపైనా ఎంఎస్ఎంఈ కింద శిక్షణ తరగతులను ఏర్పాటు చేయడంపై ఆయన సమీక్షించారు.

సచివాలయాల్లో సత్వర సేవలందించండి

● కార్యదర్శులకు మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశం

మచిలీపట్నం టౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): సచివాలయాల ద్వారా ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు. గురువారం బుట్టాయిపేట 18వ డివిజన్ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ కార్యదర్శుల పనితీరుపై సమీక్షించారు. వివిధ విభాగాల్లో ప్రజలకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, పింఛన్ల పంపిణీ, రేషన్ పంపిణీ సక్రమంగా అందుతున్నాయో లేదో పరిశీలించాలని సూచించారు. మహిళా పోలీసులు, విద్యా విభాగాన్ని సందర్శించే కార్యదర్శులతో మాట్లాడారు. పారిశుధ్యాన్ని పరిశీలించే కార్యదర్శి శ్రీనివాసరావుతో మాట్లాడారు. మంత్రి వెంట మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, మునిసిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం, టౌన్‌హాలు మాజీ చైర్మన్ చిన్నం శివనాగేశ్వరరావు, గోకుల శివ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు లంకే నారాయణప్రసాద్ ఉన్నారు.



బుట్టాయిపేటలోని 18వ డివిజన్ సచివాలయ కార్యదర్శులతో మంత్రి కొల్లు రవీంద్ర

రేపు ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా రక్త, అన్నదాన కార్యక్రమాలు

టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా బస్టాండు సెంటర్‌లో శనివారం రక్త, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించాలని నాయకులకు మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. గురువారం నాయకులతో మంత్రి సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. పార్టీ సభ్యత్వం తీసుకుని సహజ మరణం పొందిన కార్యకర్తల కుటుంబసభ్యులకు రూ.5 వేలు ఇస్తానని తెలిపారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, పల్లపాటి సుబ్రహ్మణ్యం, గొర్రెపాటి గోపీచంద్, కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము, మరకాని సమతా కీర్తి, దింటకుర్తి సుధాకర్, నాయకుడు గోపు సత్యనారాయణ పాల్గొన్నారు.

టీడీపీ పెదపట్నం నాయకుడికి శాశ్వత సభ్యత్వం

టీడీపీ పెదపట్నం గ్రామ నాయకుడు మీనం నాగేశ్వరరావు రూ.లక్ష చెల్లించి పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. గురువారం ఆర్ అండ్ బీ అతిథి గృహంలో మీనం నాగేశ్వరరావును మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు సత్కరించారు. రాష్ట్రంలో గత ఏడాది కన్నా ఈ ఏడాది పెద్ద సంఖ్యలో సభ్యత్వం తీసుకున్నారని మంత్రి తెలిపారు.



మీనం నాగేశ్వరరావును సత్కరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు



హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కుటుంబసభ్యులు

దివిసీమను ఎన్నటికీ మరిచిపోను

● నా సేవాజీవితానికి నాంది అక్కడే: హరియాణ గవర్నర్ దత్తాత్రేయ

అవనిగడ్డ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): దివిసీమను ఎన్నటికీ మరిచిపోలేనని, తన సేవా జీవితానికి నాంది పలికింది అక్కడేనని హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. గురువారం చండీఘర్ రాజ్‌భవన్‌లో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కుటుంబసమేతంగా దత్తాత్రేయను కలిశారు. దివిసీమ ఉప్పెన సమయంలో పనిచేసిన వారందరినీ దత్తాత్రేయ గుర్తు చేసుకున్నారు. పేరుపేరునా వారి గురించి అడిగారు. నాటి ఉప్పెనలో మండలి వెంకట కృష్ణారావు ఎనలేని సేవ చేశారని అన్నారు. కాళ్లలో ముళ్లు గుచ్చుకుని పుండ్లు పడినా లెక్కచేయకుండా అవిశ్రాంతంగా పనిచేశారని గుర్తు చేసుకున్నారు. మండలి కృష్ణారావు-ప్రభావతి దంపతులు తన పట్ల చూపిన ప్రేమాభిమానాలు మరచిపోలేనన్నారు. తన తండ్రి మండలి వెంకట కృష్ణారావు మిమ్మల్ని సోదరుడిగా భావించేవారని, తాము తమ కుటుంబసభ్యుడిగానే భావిస్తామని దత్తాత్రేయతో బుద్ధప్రసాద్ అన్నారు. బుద్ధప్రసాద్ కుటుంబసభ్యులను దత్తాత్రేయ సత్కరించారు. దత్తాత్రేయను బుద్ధప్రసాద్, వెంకట్రామ్ సత్కరించారు. బుద్ధప్రసాద్ సతీమణి మండలి విజయలక్ష్మి, కుమార్తె శీలం కృష్ణప్రభ, తనయుడు- కోడలు మండలి వెంకట్రామ్- సాయి సుప్రియ పాల్గొన్నారు.

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం

అవనిగడ్డ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): న్యాయవాది పరుచూరి రామవేంద్రరావు ఆధ్వర్యంలో బందలాయిచెరువు గ్రామానికి చెందిన పరుచూరి రామస్వామి-రాధా రుక్మిణి వంశస్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం 275 మందితో ఘనంగా నిర్వహించారు. రామస్వామి రాధా రుక్మిణికి ఎనిమిది మంది మగ, ఇద్దరు స్త్రీ సంతానం. వీరికి మొత్తం 80 మంది సంతానం కాగా, 80 మందికి పుట్టిన వారు వారి పిల్లలు, మనవళ్లు, మునిమనవళ్లు మొత్తం 275 మంది వంశస్థులుగా ఉన్నారు. వీరిలో ఆడపిల్లల సంతానమైన మాజీ మంత్రి దివంగత సింహాద్రి సత్యనారాయణరావు తనయుడు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌రావు, మరో మహిళకు మనుమడైన మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు కూడా ఈ వంశంలోని వారే. వీరి వంశంలో అనేక మంది రాజకీయ పదవులు అలంకరించారు. వామపక్ష భావాలతో సమాజ మార్పుకోసం కృషి చేసిన వారు ఉన్నారు. వంశస్థులంతా ఒక్క చోటకు చేరి సందడిగా గడిపారు.



ఆత్మీయ సమ్మేళనానికి విచ్చేసిన పరుచూరి రామస్వామి - రాధా రుక్మిణి వంశస్థులు

డ్రెయిన్ల పరిశీలన

అవనిగడ్డ రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఖరీఫ్ సీజన్‌కు ముందే మోదుమూడి పరిధిలోని డ్రెయిన్లలో చేయాల్సిన పనులను గుర్తించేందుకు గురువారం కోడూరు డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్ డ్రెయిన్లను పరిశీలించారు. సాగునీటి సంఘ పరిధిలోని పొలిమేర కోడు, మాచవరం డ్రెయిన్ల పూడికతీత పనులు చేపట్టాలని, అవసరమైన చోట కల్వర్టులు నిర్మించాలని గుర్తించారు. డ్రెయిన్లను బాగు చేయడం ద్వారా సాగునీటి ఇక్కట్లు లేకుండా చూడాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. డ్రెయినేజీ ఏఈఈ అబ్దుల్ కరీమ్, బచ్చు మల్లి, తోట చక్రధర్, బచ్చు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఐ లవ్ ఘంటసాల బోర్డు ప్రారంభం

ఘంటసాల, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవ, బౌద్ధక్షేత్రంగా విరాజిల్లుతున్న ఘంటసాల గ్రామంలో గొర్రెపాటి విద్యా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐ లవ్ ఘంటసాల బోర్డును ఎన్ఆర్ఐ గొర్రెపాటి రంగనాథ్‌బాబు-ఇందిర దంపతులు గురువారం ప్రారంభించారు. చారిత్రక గ్రామం ఘంటసాల శైవ, బౌద్ధ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందాలని, గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు, గౌతమ బుద్ధుడు, జలదీశ్వరస్వామి భారీ విగ్రహాల ప్రాంగణంలో బోర్డు ఏర్పాటు చేశామన్నారు. గ్రామాభివృద్ధికి సహకారం అందిస్తామని రంగనాథ్‌బాబు తెలిపారు. బోర్డు వద్ద ప్రతి ఒక్కరూ ఫొటోలు దిగి సోషల్ మీడియాలో పోస్టు చేయాలని ఎన్ఆర్ఐ వేమూరి రాజేష్ సూచించారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకటరామకృష్ణ, కొండపల్లి రామకృష్ణ, ఎస్.సతీష్, గ్రామస్థులు పాల్గొన్నారు.



బోర్డును ప్రారంభిస్తున్న ఎన్ఆర్ఐ రంగనాథ్‌బాబు దంపతులు



అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాల 2004-06 బ్యాచ్ విద్యార్థులు

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అవనిగడ్డ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురువారం సందడిగా కొనసాగింది. 2004-2006 బ్యాచ్ పూర్వ విద్యార్థులు కళాశాలలో చదువుకున్న ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కుశల ప్రశ్నలతో సందడిగా గడిపారు. అధ్యాపకులు హరికృష్ణ, షణ్ముఖరావు, రాజ్‌కుమార్, రాజేందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

చల్లపల్లి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకుల(వీఆర్ఏల) సంఘం క్యాలెండర్‌ను గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, ఏఎస్వో షేక్ అఖిలాపర్వీన్, జూనియర్ అసిస్టెంట్ పి.యోజిత, గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వెంకటరత్నం, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, గన్నవరం, చల్లపల్లి మండలాల అధ్యక్షులు ఎం.పూర్ణచంద్రరావు, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్ఐ కృష్ణమోహన్, వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం

తైక్వాండో క్రీడాకారిణికి నగదు ప్రోత్సాహం

ఘంటసాల, జనవరి 16(ఆంధ్రజ్యోతి): తైక్వాండో జాతీయ పోటీలకు ఎంపికైన తెలుగురావుపాలెం గ్రామానికి చెందిన విద్యార్థిని చిట్టూరి సాత్వికను గుత్తికొండ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు గుత్తికొండ కల్యాణ్, గుత్తికొండ రవిబాబు అభినందించారు. సాత్వికను సత్కరించి రూ.10 వేలను గుత్తికొండ ప్రత్యూష అందజేశారు.



చిట్టూరి సాత్వికకు నగదు అందజేస్తున్న గుత్తికొండ ప్రత్యూష

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

చల్లపల్లి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మంగళాపురంలో అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన గొరిపర్తి శ్రీనివాసరావు కుటుంబానికి రావెళ్ల కృష్ణ ఫౌండేషన్ నిర్వాహకుడు రావెళ్ల ఉదయ్‌కుమార్ ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించిన ఉదయ్‌కుమార్ రూ.10వేలు, దుస్తులు అందించారు. చల్లపల్లి డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, టీడీపీ నేతలు తూము కృష్ణమోహన్, కైతేపల్లి వెంకయ్య, పరుచూరి సురేష్, మండవ ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న రావెళ్ల ఉదయ్‌కుమార్

కార్నియా సేకరణ

కోడూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): గ్రామానికి చెందిన గెల్లి లక్ష్మీనాంచారమ్మ ఆకస్మికంగా మృతి చెందారు. ఆమె నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేయడానికి ముందుకు వచ్చారు. విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది గ్రామానికి వచ్చి కంటి నుంచి కార్నియాను సేకరించి ఐ బ్యాంక్‌కు తరలించారు. వాసవీక్లబ్ దివిసీమ కోడూరు(కపుల్స్) అధ్యక్షుడు కోడూరు వెంకటసత్యనారాయణ, క్లబ్ సభ్యులు అద్దెపల్లి సత్యనారాయణ, మృతురాలి కుమారుడు గెల్లి సుధాకర్ పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

గూడూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మల్లవోలు గ్రామానికి చెందిన అడ్డాల ఆంజనేయులు బుధవారం మృతిచెందారు. ఆయన అంత్యక్రియల నిమిత్తం మల్లవోలుకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ రూ.5వేలు అందించింది. అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ యూత్ ప్రెసిడెంట్ పడవల మోహనత్రినాథ్, ముద్దినేని వెంకటేశ్వరరావు, నెహ్రూ మాస్టర్ ధర్మతేజ పాల్గొన్నారు.



రోడ్డు భద్రతా మాసోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ, రవాణా శాఖ కమిషనర్ బీఎస్ఎస్ నాయక్

రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గాలి

● రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించండి
● అధికారులకు కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశం

మచిలీపట్నం టౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): 'ఈ ఏడాది రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గాలి. అందుకోసం ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలి.' అని అధికారులను కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. ఈనెల 16 వ తేదీ నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా వాల్‌పోస్టర్లు, కరపత్రాలను రవాణాశాఖ కమిషనర్ బీఎస్ఎస్‌నాయక్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. రహదారి భద్రతా నిబంధనలను పాటించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ట్రాఫిక్ సీఐ ఏవీ శివకుమార్, గుడివాడ ఆర్టీవో ఎస్‌యూఎస్ఎస్ శ్రీనివాస్, ఉయ్యూరు ఎంవీఐ టీవీఎస్‌సుబ్బారావు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దు: డీఎస్పీ

రోడ్డు భద్రత నియమాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. 'ద్విచక్రవాహనదారులు హెల్మెట్లు పెట్టుకోవాలి. కార్లు నడిపేవారు సీటుబెల్టు పెట్టుకోవాలి. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దు. కుటుంబసభ్యులు ఎదురుచూస్తుంటారన్న ఆలోచనతో వాహనాన్ని నడిపాలి. ప్రమాదాల బారిన పడకుండా ఇంటికి చేరాలి.' అని డీఎస్పీ సూచించారు. ట్రాఫిక్ సీఐ అశోక్, శివ, ఎస్సై వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ అబ్దుల్ సుభాన్

హెల్మెట్ ధరిస్తాం

హెల్మెట్ ధరించి బైక్ నడుపుతామని ద్విచక్ర వాహనదారులతో ట్రాఫిక్ ఎస్సై వెంకటేశ్వరరావు ప్రతిజ్ఞ చేయించారు. రహదారి మాసోత్సవాల్లో భాగంగా కోనేరుసెంటర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించి, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.



ద్విచక్రవాహనదారుడితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ట్రాఫిక్ ఎస్సై వెంకటేశ్వరరావు

సచివాలయాల్లో సత్వర సేవలందించండి : మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): సచివాలయాల ద్వారా ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించాలని మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు. గురువారం బుట్టాయిపేట 18వ డివిజన్ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ కార్యదర్శుల పనితీరుపై సమీక్షించారు. వివిధ విభాగాల్లో ప్రజలకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, పింఛన్ల పంపిణీ, రేషన్ పంపిణీ సక్రమంగా అందుతున్నాయో లేదో పరిశీలించాలని సూచించారు. మహిళా పోలీసులు, విద్యా విభాగాన్ని సందర్శించే కార్యదర్శులతో మాట్లాడారు. పారిశుధ్యాన్ని పరిశీలించే కార్యదర్శి శ్రీనివాసరావుతో మాట్లాడారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం, టౌన్‌హాలు మాజీ చైర్మన్ చిన్నం శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో బార్ అండ్ రెస్టారెంట్!

● ఆర్డీవో చైర్మన్‌గా ఉన్న ఆఫీసర్స్ క్లబ్‌లో చకచకా సాగుతున్న పనులు ● కలెక్టర్ దృష్టి సారించాలని కోరుతున్న పట్టణవాసులు

ఆంధ్రజ్యోతి - గుడివాడ: రెవెన్యూ శాఖకు చెందిన స్థలంలో ఆఫీసర్స్ క్లబ్ ఉంది. క్లబ్‌కు గుడివాడ ఆర్డీవో శాశ్వత చైర్మన్‌గా వ్యవహరిస్తారు. క్లబ్‌లో బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుకు ఎటువంటి అనుమతి లేకుండానే పనులు చకచకా జరిగిపోతున్నాయని సమాచారం. దీనికోసం క్లబ్ బయట ఉన్న దుకాణాలను ఖాళీ చేయాలని కమిటీ ఆదేశించినట్లు తెలిసింది. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇదే క్లబ్‌లో వైసీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించింది. అప్పట్లో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి ఆర్డీవో స్పందించి ప్రచారాలు నిర్వహించకుండా గేటుకు తాళాలు వేసిన విషయం విదితమే. కలెక్టర్ దృష్టి సారించి బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేయకుండా చూడాలని పట్టణవాసులు కోరుతున్నారు.



ఆఫీసర్స్ క్లబ్

గుడివాడ నడిబొడ్డులో సర్వే నంబర్ 153లో 4.84ఎకరాల విస్తీర్ణంలో డిప్యూటీ కలెక్టర్ కార్యాలయ స్థలం ఉంది. ఇందులో 1923లో బ్రిటీష్ వారి హయాంలో ఎకరం విస్తీర్ణంలో గుడివాడ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. కాలక్రమేణా ఆఫీసర్స్ క్లబ్‌గా దాని పేరు మార్చారు. క్లబ్ నిర్వహణకు కమిటీ ఉంటుంది. రెండేళ్లకోసారి తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహించి కమిటీని ఎన్నుకుంటారు. క్లబ్ మెయింటెనెన్స్, ఆదాయ, వ్యయాలను కమిటీ పర్యవేక్షిస్తుంది. ఈ క్లబ్‌కు శాశ్వత అధ్యక్షులుగా గుడివాడ ఆర్డీవో వ్యవహరిస్తారు.

కమిటీ అత్యుత్సాహం..

ఆఫీసర్స్ క్లబ్‌ను బార్ అండ్ రెస్టారెంట్‌గా మార్చాలని కమిటీ ఉత్సాహం చూపుతోందని సమాచారం. ఎటువంటి అనుమతులు లేకుండానే కమిటీ క్లబ్ ప్రాంగణమంతా పార్కింగ్ టైల్స్ వేసి, లోపల కూడా బార్ నిర్వహణకు అనుకూలంగా పనులు చేస్తున్నట్టు సమాచారం.

షాపులు ఖాళీ చేయాలని హుకుం

ఆఫీసర్స్ క్లబ్ బయట రెండు షాపులున్నాయి. ఒకటి డాక్యుమెంట్ రైటర్‌కు చెందినది, మరొకటి కిళ్లీ బడ్డీ. క్లబ్‌లో బార్‌ను ఏర్పాటు చేస్తున్నామని, వెంటనే రెండు షాపులు ఖాళీ చేయాలని వారికి కమిటీ హుకుం జారీ చేసింది. ఈ క్రమంలో డాక్యుమెంట్ రైటర్ కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నట్లు సమాచారం. అయినా ఎట్టి పరిస్థితుల్లో ఖాళీ చేయాల్సిందేనని ఒత్తిడి చేస్తున్నట్లు వినికిడి.

వైసీపీ అడ్డాగా..

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత క్లబ్‌కు ఎన్నికలు నిర్వహించలేదు. అప్పట్లో ఎమ్మెల్యే కొడాలి నాని తన అనుచరగణంతో క్లబ్‌ను తన గుప్పిట్లో పెట్టుకున్నారు. మంత్రి అయిన కొత్తలో నాని సూచించిన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రతి ఆరు నెలలకోసారి పాత కమిటీనే ఎప్పటికప్పుడు రెన్యూవల్ చేస్తూ వచ్చారు. దీనికి అప్పటి కమిటీ చైర్మన్ ఆర్డీవో వంతపాడారు. ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు క్లబ్‌ను తమ సొంత జాగీరులా వాడేసుకున్నారు. వైసీపీ ఎన్నికల ప్రచారానికి క్లబ్‌ను వినియోగించుకున్నారు. అప్పటి ఆర్డీవో పూర్తిస్థాయిలో సహకరించారు.



గత ఎన్నికల సమయంలో ఆఫీసర్స్ క్లబ్‌లో పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్న వైసీపీ నాయకులు(ఫైల్)

పారని నాని పాచిక

క్లబ్ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో నాని బ్యాచ్‌కు విపరీతమైన ఆలోచన తట్టింది. విజయవాడ, ఏలూరులోని రిక్రియేషన్ క్లబ్‌లో మద్యం అమ్మకాలకు అనుమతులిచ్చారు. ఇదే రీతిలో గుడివాడలోని ఆఫీసర్స్ క్లబ్‌ను కూడా బార్ అండ్ రెస్టారెంట్‌గా మార్చాలని కుటిల యత్నం చేశారు. మరోమారు వైసీపీ అధికారంలోకి వస్తుందనే ధీమాతో ప్రణాళికలు సిద్ధం చేసినట్టు సమాచారం. అప్పటి కలెక్టర్ అనుమతులు నిరాకరించడంతో నాని బ్యాచ్ ఆటలు సాగలేదు.

రెవెన్యూ స్థలంలో బార్‌పై ఆగ్రహం

రెవెన్యూ శాఖకు చెందిన ప్రభుత్వ స్థలం, అదీ ఆర్డీవో స్థాయి అధికారి చైర్మన్‌గా వ్యవహరించే క్లబ్‌లో మద్యం అమ్మకాలకు అనుమతులు ఎలా ఇస్తారని పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన కమిటీ ఏకంగా క్లబ్‌ను బార్ అండ్ రెస్టారెంట్‌గా మార్చాలని ప్రయత్నాలు చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కలెక్టర్ దృష్టి సారించాలని కోరుతున్నారు.

జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు సాయిబాబు

ఉంగుటూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఒడిషా రాష్ట్రంలోని పూరి నగరంలో ఈనెల 17, 18, 19తేదీల్లో జరగనున్న సీనియర్ పురుషుల షూటింగ్ బాల్ పోటీలకు గోగులమూడి సాయిబాబు ఎంపికైనట్లు కృష్ణాజిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు అట్లూరి రాజశేఖర్ తెలిపారు. ఈసందర్భంగా సాయిబాబును కృష్ణాజిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ సభ్యులు, జిల్లాలోని ప్రముఖ క్రీడాకారులు, క్రీడాసంఘ నాయకులు అభినందించారు.

నేడు లక్ష్మీగణపతి హోమం

గుడివాడ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రధాన రోడ్డులోని విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో సంకటహర చతుర్థి సందర్భంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తామని ఆలయ ఈవో వై.శ్రీనివాసరావు(వాసు) గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనే భక్తులు రూ.516 చెల్లించి, గోత్రనామాలతో పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో
సీసీ కెమెరాలు అమర్చుకోవాలి

● ఎస్సై అర్జునరాజు

తోట్లవల్లూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): చోరీలు, ఇతర ఘటనలు జరుగుతున్నందున దేవాలయాలు, చర్చిలు, మసీదుల్లో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై ఎం.అర్జునరాజు సూచించారు. తోట్లవల్లూరు వేణుగోపాలస్వామి ఆలయంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోని దేవాలయాలు, చర్చిలు, మసీదులను గురువారం ఆయన సందర్శించారు. వారం రోజుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ పత్రాలను అందించారు. సీసీ కెమెరాలున్నప్పటికీ అన్నివైపులా ఉండేలా మరికొన్ని కెమెరాలను ఏర్పాటు చేయాలని, అసలు లేనిచోట త్వరగా ఏర్పాటు చేసుకుని పోలీసులకు సహకరించాలని ఎస్సై సూచించారు. ఎస్సై వెంట గ్రామ సచివాలయ మహిళా పోలీసు శిరీష ఉన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న శ్రీకృష్ణ యాదవ సంఘ నాయకులు

వృద్ధులకు దుస్తుల పంపిణీ

గుడివాడ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా, కొవ్వూరు నియోజకవర్గం కలవలపల్లి గ్రామస్థుడు తాతా చంద్రశేఖర్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో గురువారం శాంతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు చీరలు పంపిణీ చేసి, అన్నదానం చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.హరికుమార్, సభ్యులు మాకుల సత్యం, హరిబాబు పాల్గొన్నారు.



హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కుటుంబసభ్యులు

దివిసీమను ఎన్నటికీ మరిచిపోను

● నా సేవాజీవితానికి నాంది అక్కడే: హరియాణ గవర్నర్ దత్తాత్రేయ

అవనిగడ్డ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): దివిసీమను ఎన్నటికీ మరిచిపోలేనని, తన సేవా జీవితానికి నాంది పలికింది దివిసీమలోనే అని హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. గురువారం చండీఘర్ రాజ్‌భవన్‌లో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కుటుంబసమేతంగా దత్తాత్రేయను కలిశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ దివిసీమ ఉప్పెన సమయంలో పనిచేసిన వారందరినీ గుర్తు చేసుకున్నారు. పేరుపేరునా వారి గురించి అడిగారు. నాటి ఉప్పెనలో మండలి వెంకట కృష్ణారావు ఎనలేని సేవ చేశారని దత్తాత్రేయ అన్నారు. కాళ్లలో ముళ్లు గుచ్చుకుని పుండ్లు పడినా లెక్కచేయకుండా అవిశ్రాంతంగా పనిచేశారని గుర్తు చేసుకున్నారు. మండలి కృష్ణారావు-ప్రభావతి దంపతులు తన పట్ల చూపిన ప్రేమాభిమానాలు మరచిపోలేనన్నారు. తన తండ్రి మండలి వెంకట కృష్ణారావు మిమ్మల్ని సోదరుడిగా భావించే వారని, తాము తమ కుటుంబసభ్యుడిగానే భావిస్తామని దత్తాత్రేయతో బుద్ధప్రసాద్ అన్నారు. బుద్ధప్రసాద్ కుటుంబసభ్యులను దత్తాత్రేయ సత్కరించారు. దత్తాత్రేను బుద్ధప్రసాద్, వెంకట్రామ్ సత్కరించారు. బుద్ధప్రసాద్ సతీమణి మండలి విజయలక్ష్మి, కుమార్తె శీలం కృష్ణప్రభ, తనయుడు- కోడలు మండలి వెంకట్రామ్- సాయి సుప్రియ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

ఉంగుటూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): చెన్నై-కోల్‌కతా జాతీయరహదారిపై గన్నవరం ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ గుర్తుతెలియని వ్యక్తి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. గన్నవరం ఎస్సై శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద సోమవారం సాయంత్రం 6గంటల సమయంలో సుమారు 50ఏళ్ల వయసుగల గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి ఏలూరువైపు వేగంగా వెళ్తున్న వ్యాన్ ఢీకొంది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బాధితుడిని పోలీసులు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించటంతో మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి సమాచారం తెలిసిన వారు గన్నవరం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై తెలిపారు.



రోడ్డు భద్రతా మాసోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ, రవాణా శాఖ కమిషనర్ బీఎస్ఎస్ నాయక్

రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గాలి

● అందుకోసం రహదారి భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహించండి.. అధికారులకు కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశం

మచిలీపట్నం టౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): 'ఈ ఏడాది రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గాలి. అందుకోసం ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలి.' అని అధికారులను కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. ఈనెల 16 వతేదీ నుంచి ఫిబ్రవరి 15 వరకు రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా వాల్‌పోస్టర్లు, కరపత్రాలను రవాణాశాఖ కమిషనర్ బీఎస్ఎస్‌నాయక్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. రహదారి భద్రతా నిబంధనలను పాటించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ట్రాఫిక్ సీఐ ఏవీ శివకుమార్, గుడివాడ ఆర్డీవో ఎన్‌యుఎన్ఎస్ శ్రీనివాస్, ఉయ్యూరు ఎంవీఐ టీవీఎన్‌సుబ్బారావు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన అవసరం

రోడ్డు భద్రత నియమాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని బందరు డీఎస్పీ అబ్దుల్ సుబాన్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు పెట్టుకోవాలని, కార్లు నడిపేవారు సీటుబెల్టు పెట్టుకోవాలని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయొద్దని, కుటుంబ సభ్యులు తమ కోసం ఎదురుచూస్తుంటారన్న ఆలోచనతో వాహనాన్ని నడుపుతూ ప్రమాదాల బారిన పడకుండా ఇంటికి చేరాలని ఆయన సూచించారు. ట్రాఫిక్ సీఐ అశోక్, శివ, ఎస్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ అబ్దుల్ సుబాన్

హెల్మెట్ ధరిస్తాం

హెల్మెట్ ధరించి బైక్ నడుపుతామని ద్విచక్ర వాహనదారులతో ట్రాఫిక్ ఎస్సై వెంకటేశ్వరరావు ప్రతిజ్ఞ చేయించారు. రహదారి మాసోత్సవాల్లో భాగంగా గురువారం కోనేరు సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.



ద్విచక్రవాహనదారుడితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ట్రాఫిక్ ఎస్సై వెంకటేశ్వరరావు

తంబి వర్ధంతి మహోత్సవాలు విజయవంతం

● సహకరించిన అందరికీ కృతజ్ఞతలు
● తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ రెవ.ఫాదర్ జోసఫ్ పాలడుగు

ఉంగుటూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలో సుప్రసిద్ధ కతోలికా పుణ్యక్షేత్రంగా పేర్గాంచిన కృష్ణాజిల్లా, ఉంగుటూరుమండలం, పెదఅవుటపల్లిలోని బ్రదర్ జోసఫ్ తంబి పుణ్యక్షేత్రంలో ఈనెల 13నుండి 15వరకు(మూడురోజులపాటు) అత్యంత వైభవంగా జరిగిన తంబి 80వ వర్ధంతి మహోత్సవాలు(తిరునాళ్లు)విజయవంతం చేయడంలో సహకరించిన అందరికీ తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ రెవ.ఫాదర్ జోసఫ్ పాలడుగు కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం, ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు, భక్తులకు విశేష సేవలందించిన గురువులు, వాలెంటీర్లు, గుడిపెద్దలు, సంఘపెద్దలు, యూత్ మరియు మరియదళ సభ్యులు, కన్యాస్త్రీలు, స్థానిక ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. యాత్రికుల కోసం 24గంటలూ ప్రత్యేక సర్వీసులు నడిపిన ఆర్టీసీ అధికారులతోపాటు ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలతో గట్టి బందో బస్తు నిర్వహించిన పోలీసు అధికారులను, తాగునీరు, శానిటేషన్, మెడికల్, ఫైర్, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా నిరంతరం పర్యవేక్షణ చేసిన అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. మూడురోజులు క్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసేలా పలు ప్రదర్శనలు నిర్వహించి భక్తులను విశేషంగా అలరించిన గాయకులు, కళాకారులకు అభినందనలు తెలియజేశారు. మీడియాకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



వలంటీర్లను అభినందిస్తున్న ఫాదర్ జోసఫ్